# ఊహకందని నిజాలు



రచన: 'మాష్టర్ రవి'

రాజీ—

ఒక్క విషయం రాస్తాను. కోపగించుకోవుకదూ? నీ ఉత్తరం ఆసాంతం చదివాక, ఇది నీకు తప్పక రాయాల్సినిపించింది. నువ్వు నా మనసెరిగిన దానివి గాబట్టి, నన్నపార్థం చేసుకోవని భావిస్తాను.

తలిదండ్రుల్ని కోల్పోయిన మీకు, దేముడే పంపినట్టుగా, శేఖరం వచ్చి, ఎంతో సహాయ సహకారాలు, మీకు కొరవడిన ప్రేమానురాగాలు ఇస్తున్నాడని రాశావ్. చాలా సంతోషం.

ఆడపిల్లలు సహజంగా అల్ప సంతోషులు. కాస్తగా పొగిడితే బూరెల్లా పొంగిపోయే రకాలు. అందులోనూ ఆపదలో ఆదుకున్న వారంటే, ఇంకేం-ప్రాణాలే అర్పించేస్తారు.

ప్రాణాలు పోయినా, మానమే ముఖ్యమని ఎంచే త్యాగశీలలను కన్న భూమి మనది.

శేఖరం స్వతహాగా మంచివాడే కావచ్చు. మీపై అతడు చూపేదంతా కేవలం సోదరప్రేమే కావచ్చు.

గానీ ఒక్క విషయంమాత్రం గుర్తుంచు! తరతరాల్నుంచీ, మగాడు ఆడదాన్ని పతనం చేస్తూనే వున్నాడు. అన్నీ తెలిసీ, ఈ ఆడది ఆ మంటల్లో దూకుతూనే వుంది. ఇదొక అంతులేని మహా సంగ్రామం. ఈ సంగ్రామంలో, నిశ్చయంగా ఓటమిమాత్రం స్త్రీదే ఔతోంది.

: స్త్రీ పురుషుల మధ్య స్నేహాన్ని, నేను ఎందుకో పవిత్రంగా చూడలేను. నేను తప్పే కావచ్చు. ముందు ఏ భావం లేకుండానే స్నేహం ప్రారంభమౌతుంది. సహాయం చెయ్యడమే తొలి లక్షణంగా వుంటుంది. గానీ, రాజీ-రాను రాను, చూపుల్లో వాత్సల్యం పోయి ప్రేమ నిండుతుంది. ఆ ప్రేమ, సోదరప్రేమగా పిలవబడవచ్చు గానీ, ఆఖరికి అది, స్త్రీ పురుషుల మధ్య వుండే లైంగిక ప్రేమగా, ఒకనాటికి వ్యక్తీకరింపబడుతుంది. అందుకు ఏ ఒక్కరిదీ తప్పుకాకపోవచ్చు. ఎవర్నీ మనం నిందించలేకపోవచ్చు. పరిస్థితులూ, వాతావరణమూ, వయసుచేసే అల్లరీ-వల్ల, మరో మార్గం తొక్కక తప్పదు. ఏ మార్గం తొక్కినా, చెడిపోయేది ఆడదేగాని, ఆ మహానుభావుడు కాదుకదా! తీరా పీకల మీదకు వచ్చేసరికి, సరి - అడ్రసేనా మిగల్చకుండా తుర్రుమంటాడు.

మీ శేఖరం విషయం వేరుకావచ్చు. అతడు చాలా మంచివాడే కావచ్చు, గానీ, లోకరీతి నీకు రాస్తున్నాను.

ఈమధ్య ఇక్కడ జరిగిన ఒక సంఘటన, ఈ సందర్భంలో నీకు తెలుపడం ఉచితమనుకుంటాను.

మా యింటి పక్కనే ఒక ఇంజనీరుగారున్నారు. ఆయనకు సుశీల అని ఒకేఒక్క కూతురు. పి. యు. సి. చదువుతోంది. వాళ్ల దూరపు బంధువుల అబ్బాయి ఒకడు, ఆ ఇంట్లోనే వుండి మెడిసన్ చదువుతున్నాడు. పేరు మోహన్. అందగాడే.

ఆ అబ్బాయి సుశీలను 'సిస్టర్' అని పిలిచేవాడు. సుశీల కూడా అతన్ని 'అన్నయ్యా' అనేది. వాళ్లిద్దరూ చాలా చనువుగా వున్నా, ఎవరూ ఏమీ ఆటంకపర్చలేదు.

చదువుకుంటున్న పిల్లలు చనువుగా వుండటంలోనూ, కలిసిమెలిసి కలివిడిగా తిరగటంలోనూ, ఎవరికీ ఎట్టి ఆశ్చర్యమూ, అనుమానమూ కలగలేదు.

వాళ్ళిద్దరూ సాయంత్రాల షికార్లకని, సినిమాలకనీ వెళ్ళినా, ఒకే రిక్షాలో వచ్చినా, ఎవరూ ఏమీ అనేవారుకాదు. నిజానికి, వాళ్ళిద్దర్లోనూ, తొలితొలి ఏ భావమూ వుండి వుండకపోవచ్చు. గానీ, చుట్టూ వాతావరణమూ; షికార్లు, నేటి సినిమాలలో విరివిగా వుండే

శృంగార దృశ్యాలు, అన్నిటికన్నా ముఖ్యంగా వారిలో వయస్సు - ఇవన్నీ కలిసి వారిని తప్పటడుగు వేయించాయి.

నువ్వెన్ని చెప్పు రాజీ - ఒక్క విషయంలో మట్టుకు నేను ఏకీభవించలేకపోతున్నాను. మనమంతా నాగరికత_నాగరికత అని గోలపెడుతున్నాంగానీ, ఇది నిజమైన నాగరికత కాదని; ఆ పేరిట జరిగే నైతిక పతనమని_నా కనిపిస్తుంది. నేను తప్పుకావచ్చు. నా ఈ సిద్ధాంతం ఎవరికీ నచ్చకపోవచ్చు. గానీ, నేను నమ్మేది ఇది.

అల్లారు ముద్దుగా పెంచుకున్న సుశీల ఒకరోజు కనిపించకపోయేసరికి, ఇంజనీరుగారు గడగడలాడిపోయారు. బంధువులందరికీ టెలిగ్రాంలు పంపేరు. మనుషుల్ని నాలుగు పక్కలా పంపేరు. ఆమెతోపాటు మోహన్ కూడా మాయమయ్యేసరికి, ఆవూరికి కూడా కబురు పంపేరు. ఐనా ఏమీ ప్రయోజనం లేకపోయింది.

ఇక్కడ నేనొకమాట అనక మానను. వాళ్ళిద్దరూ, సిస్టర్ అనుకోనీ, బ్రదర్ అనుకోనీ_ఆఖర్ని ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. కావాలనుకున్నారు. గానీ, వారిలో ఏ ఒక్కరికీ, పెద్దల ఎదుటపడి, తమ కోర్కె చెప్పే ధైర్యం లేకపోయింది. తలిదండ్రులు అంగీకరించరేమో అనే భయంతో, పిరికివారై, పరారైపోయారు. నేటికి నాలుగు నెలలైంది. వారి జాడే లేదు.

ఇంజనీరుగారు దాదాపుగా పాపం పిచ్చివాడైపోయినట్టే. దారిని పోయేవారిని నిలబెట్టి - 'చూడండీ - నా సుశీకి నేనేం అన్యాయం చేశానని ఇలా చేసింది చెప్పండీ? నాన్నా-అతణ్నే చేసుకుంటానంటే వద్దనేవాణ్నా? ఈ వయస్సులో చూశారా_నాకెంత క్షోభ కలిగించిందో! మీకనిపిస్తే కాస్త చెప్పరూ—' అంటూంటే, నిజంగా చాలా బాధ కలుగుతుంది.

అది తల్చుకున్నప్పుడల్లా, నా గుండెలు దడదడలాడతాయి. ఏ ఆడపిల్లైనా, పరాయి మగాడిగూర్చి మా అన్నయ్య అన్నా; మేమిద్దరం అన్నా చెల్లెళ్లలా వుంటాం - అని ఏ అబ్బాయి అన్నా - నాకు మాత్రం విశ్వాసం కుదరదు.

నిజమైన ప్రేమ నేడు కొరవడిందనీ, కామానికే మారుపేరు పెట్టి, ప్రేమ అని అంటున్నారనీ - నా విశ్వాసం.

చాలా పెద్ద ఉత్తరం రాశాను. నీ మనసు నొప్పించే విషయాలుంటే క్షమించు. ఏమైనా, ఆడది జాగ్రత్తగా వుండటం ఎంతో అవసరమని గుర్తించి, ప్రవర్తించవల్సిందిగా కోర్తూ; జయకి ఆశీస్సులందిస్తూ—

నీ_రాధ.

ఉత్తరం పూర్తిచేసి, ఆలోచనలో పడింది రాజ్యలక్ష్మి. గదిలో జయ ఏదో చదువుకుంటోంది. తనకు జయ, జయకు తను తప్ప ఈ లోకంలో ఎవ్వరూ లేరు. జయ తొమ్మిదో తరగతి చదువుతూండగా, తండ్రి లారీ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఆ కబురు విన్న తల్లి, గుండె ఆగి మరణించింది.

రాజ్యలక్ష్మికి వేరు గత్యంతరంలేక, ఉద్యోగంలో చేరింది. ఆ డబ్బుతోనే రోజులు గడుపుతూ, జయను స్కూల్ ఫైనల్ వరకూ చదివించింది. ఇప్పుడు జయకు శలవులు. తర్వాత, పి. యూసి. చదువుదామనే ఆశ ఆమెకు వున్నా 'అంత శక్తి నాకు లేదు జయా! నీవూ ఏదో ఉద్యోగం చేస్తే ఇద్దరం హాయిగా జీవించవచ్చు—' అంది రాజ్యలక్ష్మి.

దాదాపు మూణ్నెల్లౌతుంది, శేఖరంతో వీరి పరిచయం ప్రారంభమై.

ఓసారి జయ స్కూలునుంచి వస్తూంటే వెనకపాటుగా, ఆబోతు ఢీకొనగా పడిపోయింది. అప్పుడు శేఖరమే ఆమెను హాస్పటల్‌కు తీసుకుపోయి, కట్టు కట్టించాడు. అలా ప్రారంభమైంది. వారి పరిచయం.

అతనెప్పుడూ వీరితో అసభ్యంగా ప్రవర్తించలేదు అనుచిత సంభాషణ చేయలేదు. 'మీ' ఇద్దరూ నాకు దైవమిచ్చిన చెల్లెళ్లు_' అంటాడు. తరుచూ వస్తూ పోతూంటాడు.

అతను రాజ్యలక్ష్మితో కన్నా, జయతో ఎక్కువ చనువుగా వుంటాడు.

'అరె...నువ్వా అన్నయ్యా...ఎవరో అనుకున్నాను_' అంది ఆశ్చర్యంగా జయ.

రాజ్యం వెనుదిరిగి గదిలోకి చూసింది. జయ కుర్చీలో కూర్చుని చదువుకుంటోంది. వెనగ్గా, ఆమె భుజాలమీద చేతులువేసి, శేఖరం నిల్చుని వున్నాడు.




ఈ దృశ్యం చూడగానే, ఎందుకో రాజ్యం మనసు కళవళపడింది. అందుక్కారణం అంత క్రితం చదివిన స్నేహితురాలి ఉత్తరం కావచ్చు. లేక, ఇంతవరకూ ఇలాంటిసంఘటన జరక్కపోవటమూ కావచ్చు.

తిరిగి తనపనిలో నిమగ్నమైంది రాజ్యం ఆలోచిస్తూ. గదిలోంచి నవ్వులు వినిపిస్తున్నాయి. జయ ఏదో అంటోంది. అతను నవ్వుతున్నాడు. వాళ్ళమాటల్లో స్పష్టంగా వినిపించే పదాలు-'అన్నయ్యా-చెల్లెమ్మా-'లే!

'తనని రాధ ఉత్తరం పాడుచెయ్యలేదుకదా? నిర్మలమైన తన మనస్సును, వాతావరణాన్ని, ఆ ఉత్తరం కలుషితం చేయలేదుకదా? వాళ్ళిద్దరూ, మామూలుగా అమాయకంగానే, అలా వున్నారేమో? లేక నిజంగానే కలుషిత వాతావరణం ప్రారంభమైందా? ఏంచెయ్యాలి? ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి? శేఖరంతో 'ఇక మా ఇంటికి రాకండి-' అని ఎలా చెప్పడం? అసలు చెప్పాల్సిన అవసరం వుందా? లేక ఇది నా అపోహ మాత్రమేనా?-'

ఇలా పరిపరివిధాల ఆలోచిస్తూన్న రాజ్యలక్ష్మితో '-ఏమండోయ్ చెల్లెమ్మగారూ! ఏమిటి వాళిలా దీర్ఘాలోచనా మనస్కులై వున్నవారలు? కారణం బెరుంగవచ్చునా?-' ఎలావుంది మన గ్రాంధికం డైలాగు-? అంటూ శేఖరం వచ్చి ఆమెముందు కూర్చున్నాడు.

రాజ్యం అతనివేపు చూసింది. అతని కళ్లు ఎర్రగా వున్నాయి. మిలమిలా మెరిసిపోతున్నాయి. తెల్లనిషర్టు కాలరుమీద, ఎర్రగా ఏదో మచ్చ కనిపించింది.

'మీ డైలాక్కంగాని అన్నగారూ కాలర్లమీదే హత్య చేస్తున్నారే-' అంది.

'హత్యా? అన్యాయం. కరిచే నల్లిని కూడా పిలిచి చేతిలో నిలిపి-తప్పుకాదూ ఇలా కరవడం? పో పో...' అని పంపించే నేను హత్య చేశానా?-' అన్నాడు కాలరు చూచుకుంటూ. వెంటనే సర్దుకుని-

'ఓ..ఇదా...చూశారా... చెల్లెమ్మ ఎంతపనిచేసిందో? గోళ్ళకు రంగు వేసుకున్నట్టుంది. అది కాస్తా ఇక్కడ అంటించేసింది. ఏయే...జయమ్మా! ఇలారా...చూడేం చేశావో?...' అంటూ తనే లేచి, గదిలోకి వెళ్ళాడు.

బహుశః ఆనాటినుండే శేఖరం ప్రవర్తన కొత్తగా కనబడసాగింది రాజ్యలక్ష్మికి. కానీ ఏమీ అనలేదు. జయనూ మందలించలేదు.

× × ×

రాను రాను శేఖరం ప్రవర్తనలో మార్పు స్పష్టంగా గ్రహించ గలిగింది రాజ్యం.

ఓరోజు రాత్రి పడుకున్నప్పుడు, రాజ్యం ఈవిషయంలోనే ఏదో అడగబోయేసరికి, జయ అంది తనకు తానుగా-

'అక్కా- మన శేఖరం అన్నయ్య ప్రవర్తనలో, నాకేదో మార్పు కనిపిస్తోంది. చెల్లెమ్మా-అని పిలుస్తాడుగాని, గడిగడిక్కీ నన్ను తాకాలని ప్రయత్నిస్తుంటాడు,చీటికి

మాటికీ ఏదో మిషతో నా భుజంమీద చెయ్యివేసో; ఓ రహస్యం చెప్పాలి చెల్లీ-అని ముఖందగ్గరగా రావటమో చేస్తూంటాడు. నాకు ఒక్కోసారి భయంవేస్తూంటుంది. ఈసారి గట్టిగా చెప్పేయాలనుకుంటున్నాను-' అంది.

రాజ్యంలో కొంత సంచలనం కలిగింది. తను అడగబోయే విషయమే, జయ కదిపినందుకు, సంతోషమూ కలిగింది.

'నేనూ అదే చెప్పామనుకుంటున్నానమ్మా! అలా నిర్మొహమాటంగా చెప్పేబదులు, మంచిగాచెప్తే సరిపోతుంది. ఒక్కవిషయం మాత్రం గుర్తుంచుకో! క్షణిక సుఖాలకు లొంగిపోతే, జీవితమంతా బాధపడాల్సి వస్తుంది-'

× × ×

'పోస్ట్' అనే కేకవిని, వీధిలోకివెళ్ళి, ఓకార్డు అందుకొంది రాజ్యలక్ష్మి, అందులో నాలుగేమాటలు.

'శనివారం రాత్రి నీముందుంటాను-రాధ' అంటే... ఇవాళే...ఇవాళే రాధ వస్తోందన్నమాట. జయ ఎంతలో వస్తుందా...ఇద్దరం ఎంతలో కలిసి స్టేషన్కు వెళ్దామా-అని ఎదురుచూస్తూ కూర్చుంది రాజ్యం.

ఎప్పటికీ జయ ఇంటికి రాకపోయేసరికి ఆమె రాధ విషయం మరిచిపోయి. 'జయ ఇంకా ఇంటికి రాలేదేం చెప్మా-' అని గాభరా పడసాగింది.

రాత్రి తొమ్మిదైంది. ఇంకా జయరాలేదు. 'సినిమాగాని వెళ్ళిందా? తనను చెప్పకుండా అలా ఎప్పుడూ వెళ్లదే! శేఖరంగాని ప్రోద్బలంచేసి సినిమాకు తీసుకెళ్ళాడా?-' ఇలా గజిబిజిగా ఆలోచిస్తూంటే, వీధిలో రిక్షా ఆగింది. అందులోంచి రాధ దిగడం గమనించి, పరుగున వెళ్ళి, స్నేహితురాలిని గాఢంగా కౌగలించుకుని, సాదరంగా లోని కాహ్వానించింది, రాజ్యలక్ష్మి.

'కులాసాగా వున్నావా రాజీ? జయా, మీ శేఖరం అన్నయ్య...అంతా ఓకేనా?-' కొంటెగా అంది రాధ.

'ఓ...నీదయవల్ల, అంతా ఒకే. జయ సినిమా వెళ్ళింది. వస్తుంది-' అబద్ధమాడింది.

చాలారోజులకు కలుసుకున్నందుకు, ఇద్దరూ ఎన్నెన్నో విషయాలు, చిన్ననాటి ముచ్చట్లు మాట్లాడుకుంటూ, రాత్రి పదకొండువరకూ, వంటింట్లోనే కూర్చున్నారు.

అప్పటికీ జయ తిరిగి రాకపోయేసరికి, రాజ్యలక్ష్మికి భయంతో కళ్లల్లో నీళ్ళు తిరిగాయ్.

'ఏమైందిరాజీ' అడిగింది రాధ.

'ఏంలేదు...జయగూర్చే. ఇంకా రాలేదేం చెప్మా-అని' అంది రాజ్యం.

ఇంతలో గదిలోనుండి సన్నని ఏడుపు వినబడ్డంతో, ఇద్దరూ గదిలోకి వెళ్లారు. మంచంమీద బోర్లాపడుకుని జయ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

'ఏమైంది జయా? ఎంతసేపైంది వచ్చి?' అడిగింది రాజ్యం.

ఇటు తిరిగి, ఇద్దర్నీ చూసి బావురు మని ఏడుస్తూ అంది జయ.

'నాశనమైపోయానక్కా-సర్వనాశనమై పోయాను, పవిత్రమైన అనుబంధాలమధ్య కూడా ఇంత నీచత్వం జరుగుతుందని ఊహించలేకపోయాను. అతడు...ఆ రాక్షసుడు, షికారుకని, వూరి బయట దేవాలయానికి నన్ను తీసుకెళ్ళి...సర్వ నాశనంచేశాడు-'

స్థాణువుల్లా నిలబడిపోయారు రాధ, రాజ్యలక్ష్ములు.

ఆరాత్రి ఎవరికీ నిద్రలేదు. ఎవరూ, ఏమీ మాట్లాడుకోలేదు కూడా!

తెల్లవారు ఝామున రాధ అంది-'రాజీ! విచారించకు. ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతాయని నాకెప్పుడో తెల్సు. జయ నీకెలాగో, నాకూ అలాగే చెల్లి అవుతుంది. ఈరహస్యం మనలోనే వుండనీ. మా మరిది ఒకాయన వున్నాడు. ఆతనికి జయనిచ్చి వివాహంచేసి, నాతోటి కోడలిగా చేసుకుంటాను. ఇది మోసంచేయడంకాదు. అనుకోకుండా జరిగిపోయిన ఒకపొరపాటు. ఈ శేఖరం తిరిగి వస్తాడనే నమ్మకం నాకు లేదు. వచ్చాడా బాధలేదు. లేదానికి అభయ మిస్తున్నాను-'

'రాధ...నువ్వు దేవతవు, ఎలాగేనా దాని జీవితం నిలబెట్టు-' ఇంకా ఏదో అనబోయింది రాజ్యంగానీ మధ్యలోనే జయ అందుకుంటూ-

'అక్కర్లేదు, నాకేం అక్కర్లేదు. పతితనై ఒకరికి అర్ధాంగిగా నేనుజీవించలేను. నన్ను చచ్చిపోనివ్వండి-. అంది నిశ్చయంగా.

'చచ్చి సాధించేదేముంది? తప్పులు చేసినవారంతా చచ్చేపోతే, ఇక ఈలోకంలో మిగిలేవి కేవలం సమాధులే! ఎందుకంటే తప్పులు చెయ్యనివారే లేరు గనక! నీకేం భయంలేదు, మా మరిది అభ్యుదయవాది. అతనికి నీసంగతి చెప్పి, అంగీకరిస్తేనే చేద్దాం! సరా! అంతేగాని జయా...నువ్వు తొందరపడకు-' అంటూ బేగ్ లోంచి ఒకఫోటో తీసి రాజ్యలక్ష్మికి చూపిస్తూ-' ఇతనే మా మరిది. పేరు రాజశేఖర్. ఈ వూళ్లోనే పనిచేస్తున్నాడు-' అంది.

గానీ, అప్పటికే రాజశేఖర్ ప్రాణాలు, ఆ దేవాలయ ప్రాంగణంలోనే, ఒక విషసర్పం హరించేసిందని, ఆ నిమిషంలో వీళ్లకేం తెల్సు?